అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి



మున్సిపల్ గ్రౌండ్‌లో ఫ్లైఓవర్ ప్రారంభ కార్యక్రమ ఏర్పాట్లును పరిశీలిస్తున్న నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు తెలిపారు. నేడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతులు మీదుగా ప్రారంభించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లును ఆయన పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థుల అభినందన కార్యక్రమంలో నారాయణ సీఓ పాఠశాల డీజీఎం గోపాల్‌రెడ్డి

అంబర్‌పేట: ఉత్తమ ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో భరోసానిస్తాయని నారాయణ పాఠశాలల డీజీఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. డీడీ కాలనీ నారాయణ సూపర్ సీఓ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో వారిని ఆదివారం పాఠశాలలో అభినందించారు. విద్యార్థులను అన్నివిధాల ప్రోత్సహించేందుకు తాము ముందుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం బాలపరమేశ్వర్, డీన్ హబీబ్, ప్రిన్సిపల్ శివకుమార్, ఉపాధ్యాయులు రవీందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లోనూ ఉత్తమ ఫలితాలను సాధించాలి



హైమావతి పాఠశాల విద్యార్థిని అమృతను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో యు.అమృత 592 మార్కులు సాధించింది. పేదింటి విద్యార్థిని అయిన అమృతి మంచిగా చదువుకుని ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గోల్నాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అమృతకు అభినందించి భవిష్యత్‌లోనూ ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని హైమవతి పాఠశాల ప్రిన్సిపల్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూఅచ్చయ్యనగర్ అధ్యక్షుడిగా ఏజే బాబుగౌడ్



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని న్యూ అచ్చయ్యనగర్ బస్తీ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి ఏజే బాబుగౌడ్ నియమితులయ్యారు. ఆదివారం బస్తీ కమిటీ చైర్మన్ పి.యాదగిరి అధ్యక్షతన జరిగిన బస్తీ కమిటీ సమావేశంలో సభ్యులందరూ ఏజే బాబుగౌడ్‌ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆయన పదవీ కాలం రెండు సంవత్సరాల పాటు ఉంటుందని బస్తీ కమిటీ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఏజే బాబుగౌడ్ మాట్లాడుతూ.. బస్తీ సమస్యల పరిష్కారానికి.. ప్రజల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. త్వరలో పూర్తిస్థాయి నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మేడి రమణ ఆదివారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి ఇంత వరకు ఒక్క శాఖలో కూడ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం విచారకరమన్నారు. ఎస్సీ, ఎస్టీల ఉద్యోగాలను భర్తీ చేయకుండ ఖాళీగా ఉంచడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు వర్సిటీలలో ఖాళీగా బ్యాక్‌లాగ్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

సర్వే.. సాగుతోంది..

ముందుకు సాగని కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ

- సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు
- మొత్తం దరఖాస్తులు 12 వేలు
- సర్వేలో పరిశీలించినవి 2100



సికింద్రాబాద్‌లోని సహాయ పౌరసరఫరాల కార్యాలయం

సికింద్రాబాద్: పదేళ్ల నిరీక్షణ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త రేషన్ కార్డుల జారీ ప్రకియ సికింద్రాబాద్ ప్రాంతంలో ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. సిబ్బంది కొరతతో దరఖాస్తు దారుల వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసే సర్వే ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సర్వే పూర్తి చేసిన కొద్దిపాటి దరఖాస్తుల పరిస్థితులను ఆన్‌లైన్ చేయడానికి సర్వర్ మొరాయింపు సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో రేషన్ కార్డుల జారీ కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పట్లో ఓ కొలిక్కి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

- సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి వచ్చిన వేలాది దరఖాస్తులను ఇంకా పరిశీలించే పనుల్లోనే రేషనింగ్ అధికారులు, సిబ్బంది మునిగి తేలుతున్నారు. వేల సంఖ్యలోని దరఖాస్తులను పరిశీలించేందుకు పదుల సంఖ్యలో కూడా ఉద్యోగులు లేకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. గత జనవరి మాసంలో కేవలం 1497 మంది లబ్ధిదారులను కొత్త కార్డులు జారీ చేసేందుకు ఎంపిక చేసిన అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఆ తరువాత అర్హులందరికీ కార్డులు ఇస్తామని, ఇందుకోసం దరఖాస్తులు అన్నింటినీ పరిశీలించి లబ్ధిదారులను తేల్చాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

సిబ్బంది కొరత.. సాంకేతిక సమస్యలు..

నియోజకవర్గంలో రేషన్‌కార్డుల కోసం 12 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4,100 మంది, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 6,900 వేల దరఖాస్తులు అందాయి. అయితే మొదటి విడత ఒక 5వేల దరఖాస్తులను ప్రాథమికంగా సర్వే చేయాలని అధికారులు నిర్ణయించారు.

- గతనెల 11వ తేదీ నుంచి దరఖాస్తుల ఇంటింటి సర్వే ప్రారంభం అయింది. సర్వే కోసం ఏర్పాటు చేసిన ఐదు బృందాల్లో 20 మాత్రమే మంది ఉద్యోగులు ఉన్నారు. కొద్ది మంది ఉద్యోగులు మాత్రమే సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో దరఖాస్తులు వేల కొద్ది పెండింగ్‌లోనే ఉంటున్నాయి. తమకు అందిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే ద్వారా 2100 దరఖాస్తు దారుల వాస్తవ స్థితిగతులను మాత్రమే అధికారులు సేకరించగలిగారు. ఇదిలా ఉండగా
- కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్న క్రమంలోనే జాప్యం జరుగుతున్నట్టు రేషనింగ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో ఉద్యోగి రోజుకు 20 నుంచి 50 ఇండ్లను సందర్శించి వివరాలు సేకరించాలని అధికారులు ఆదేశిస్తున్నారు, అయితే సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత ఫలితంగా రోజుకు 10 కి మించి దరఖాస్తుల పరిశీలన చేయలేకపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూసీనది ఎస్టీపీ పనుల్లో వేగం పెంచండి

సీఎస్ రామకృష్ణరావు



అంబర్‌పేట ముసారంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

అంబర్‌పేట: మూసీనది పరివాహక ప్రాంతాల్లో నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు పరిశీలించారు. ఆదివారం రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిలతో కలిసి ఆయన వివిధ ప్రాజెక్ట్‌ల వద్ద పర్యటించారు. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా ముసారంబాగ్ వద్ద మూసీనదిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, నిర్మాణంలో తలెత్తుతున్న ఇబ్బందులపై ఆయన అధికారులతో చర్చించారు. అనంతరం మూసీ పరివాహక ప్రాంతంలో 212.5 ఎంఎల్‌డీ స్థామర్థ్యంతో నిర్మిస్తున్న సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. ఎస్టీపీతో మూసీ మురుగు శుద్ధి ప్రాధాన్యం, నిర్మాణ అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయన పలువురు క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: శ్రీసాయి శారద సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు వీఎస్ఆర్ శర్మ జయంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయకుడు గోవిందరావు పాటలు పాడి అలరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు ముఖ్యఅతిథిగా హాజరై గాయనీగాయకులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎస్వీ రామారావు, వీఎస్ సుందర్‌రావు, శేషసాయి, టీఎస్ వాణి, వర్ధిని, గాయిత్రి, చంద్రతేజ, వసంత, దీప్తి తదితరులు పాల్గొన్నారు.



వీఎస్ సుందర్‌రావు, టీఎస్ వాణిని సన్మానిస్తున్న ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు

బంజారాల బలోపేతానికి కృషి చేస్తున్నాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో బంజారాల బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని తెలంగాణ బంజారా జాగృతి అధ్యక్షుడు లాకవత్ రూప్‌సింగ్ నాయక్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీతండాలో రూప్‌సింగ్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లంబాడీ తండాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఉన్న రెండు లిఫ్ట్‌లు పనిచేయకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి వాటి మరమ్మతులు చేయాలని కోరారు.



బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండా డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న రూప్‌సింగ్ నాయక్

ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, హోబా నాయక్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్ ద్వారా రూ.16 లక్షల ఆదాయం

చాదర్‌ఘాట్: ఎర్లీబర్డ్ ద్వారా మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో రూ.16 లక్షల ఆదాయం వచ్చిందని డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి 5 శాతం రాయితీతో ఏప్రిల్ 1 నుంచి 30 వరకు అవకాశం ఇచ్చారని గత బుధవారంతో ఈ పథకం ముగిసిందన్నారు. సర్కిల్-6 పరిధిలో రూ.17 లక్షల లక్ష్యం పెట్టుకుంటే రూ. 16 లక్షలు వసూలైనట్లు తెలిపారు. సుమారు 60 వేల మంది చెల్లింపుదారులుండగా కేవలం 4 వేల మంది మాత్రమే ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఈ స్కీం ముగియడంతో ఇక నుంచి మొండి బకాయిలపై దృష్టి పెడుతామని చెల్లించని వారికి నోటీసులు ఇచ్చామని, త్వరలో ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన 'వీబీఎస్'

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో విరామ బైబిల్ పాఠశాల(వీబీఎస్) వారం పాటు ఘనంగా నిర్వహించారు. 'ఫెయిత్‌శాల' అనే పేరుతో ఆదివారం జరిగిన వీబీఎస్‌లో బాలబాలికలు, యువకులు ఆటపాటలతో సందడి చేశారు. పిల్లలు బైబిల్ మెమరీ వర్స్ చెప్పారు. ఈ సందర్భంగా చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడ సాల్మన్, జూనియర్ పాస్టర్ శాంత్‌కుమార్ బైబిల్ లేఖనాలు బోధించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి కమిటీ అధ్యక్షుడు వేమూరి లూకానందరావు, కోశాధికారి ఇందర్‌జీ, ఎడిఫైస్ ఫండ్ చైర్మన్ ఆంధ్రూప్రసాద్, రాణిప్రమీల, స్వర్ణ ప్రేమ్‌కుమార్, బ్యూలా వయోలా, సీసీ మెంబర్లు, వీబీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధి వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో 29వ(ఏకోనత్రింశత్) ఇష్టిసహిత బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం అష్టోత్తర కలశాభిషేకం, చిన్న రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యానారాయణ, శ్రవణ్, శ్రీధర్, రామ్ కిషన్ పాల్గొన్నారు.

రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాలి

లిబర్టీ: రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రాజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. దేశవ్యాప్తంగా నిఘా వ్యవస్థను విస్తరింపజేయాలని ఉగ్రవాద కార్యక్రమాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు పలు చర్యలకు పాల్గొన్నారని ఇటీవల పాల్గంలో 26 మందిని పొట్టన పెట్టుకున్నారని జమ్ముకశ్మీర్‌లోను దేశంలోని వివిధ రాష్ట్రంలోనూ ఉగ్రవాదుల కార్యకలాపాలు జరగకుండా పౌరుల రక్షణ కోసం దేశ భద్రత కోసం రక్షణ రంగంలో నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దులతో పాటు ఉగ్రవాద కార్యకలాపాలు జరగకుండా ఆధునిక పరికరాలు పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో సౌభాగ్యవతి, పి.వి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

10న ఓయూ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నాన్‌టీచింగ్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికల షెడ్యుల్డును ఎన్నికల అధికారులు విడుదల చేశారు. సొసైటీలో 9 పదవులకు ఈ నెల 10 జరిగే సిక్రెట్ బ్యాలెట్ ఎన్నికలకు నేటి నుంచి (5న) నామినేషన్లను స్వీకరించనున్నారు. 7న నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు క్యాంపస్‌లోని నాన్‌టీచింగ్ హోంలో జరగనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోండి

ఖైరతాబాద్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవనం కొనసాగించాలంటే అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్లు భానుప్రదీప్, డాక్టర్ సమీర్‌లు తెలిపారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని శ్రీకర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పార్క్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వివేకానంద సేవా సమితి సభ్యులు, శ్రీకర హాస్పిటల్ డాక్టర్ సుమధుర, వాకర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎఫ్‌నగర్‌లో కంటి ఉచిత వైద్య శిబిరం..

రహమత్‌నగర్: శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఎఫ్‌నగర్‌లో ఆదివారం కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సేవకుడు శ్యాంసుందర్, బస్తీ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్, బస్తీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

తాగేనీళ్లు సరిపోతలేవ్..!

- ఖాళీ బిందెలతో నిరసనకు దిగిన మహిళలు
- లోప్రెషర్‌ను పరిష్కరించి.. సరఫరా సమయం పెంచాలని డిమాండ్



మూడు గుడుల వీధిలో నిరసన ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఫిలింనగర్: అసలే లో-ప్రెషర్.. అందులో అర్ధగంట కూడా నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ మహిళలు నిరసన దిగారు. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో మూడు గుళ్ల వద్ద ఉన్న వీధుల్లో నీటి సరఫరా సరిగా జరగడం లేదంటూ మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. బస్తీలో కొన్ని వీధుల్లో మాత్రమే నీరు సరిగా వస్తోందని మిగతా వీధుల్లో ఆ పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత లైన్‌మెన్‌తో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. శాఖ ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

సంఘం విచ్ఛిన్నానికి పాల్పడితే సహించేది లేదు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న కొండూరు గంగాధర్

తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ప్రధానకార్యదర్శి గంగాధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం విచ్ఛిన్నతకు పాల్పడితే సహించేది లేదని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ హెచ్చరించారు. సంఘం మాజీ అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారని... ఆ విధంగా చేస్తే ఉరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉద్యోగ సంఘాల జేఏసీ సదస్సు అనంతరం కొండూరు గంగాధర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 2026 వరకు తన పదవీకాలం ఉందని అటువంటి తనను తొలగించే అధికారం ఏ ఒక్కరికి లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 8సంఘాలకు ఓడీ సదుపాయం కల్పించారని గుర్తు చేశారు. సంఘం మాజీ అధ్యక్షుడు ప్రతి జిల్లాలో తిరుగుతూ సంఘం నాయకులను మభ్యపెడుతూ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తనను 33 జిల్లాల్లోని 50వేల మంది ఉద్యోగులు ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నుకున్నారని అన్నారు. జేఏసీ తలపెట్టిన ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావులు తమ సంఘం పై దృష్టి పెట్టలాని కోరారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

లిబర్టీ: చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించలేమని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దమ్ముంటే ప్రకటించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంప్ర కుమారస్వామి సవాల్ విసిరారు. బీసీలు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం మనుగడ సాగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. బీసీ దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఉభయ సభల్లో ప్రవేశపెట్టలేదని కేంద్ర ప్రభుత్వం వల్ల సాధ్యంకాదని దమ్ముంటే ప్రకటించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వాలు తీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రస్థాయిలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏమిటని కుమారస్వామి సూటిగా ప్రశ్నించారు. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీసీల నుంచి గుణపాఠం కేంద్ర ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు.

ప్రశాంతంగా 'నీట్'



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష గదదిలోకి వెళ్తున్న విద్యార్థులు



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల వద్ద హాల్‌టికెట్ నెంబర్‌లు చూస్తున్న విద్యార్థులు

ముషీరాబాద్: ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం చేపట్టిన నీట్ పరీక్ష ఆదివారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి వెళ్లారు. విద్యార్థుల వద్ద ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా పరీక్షా కేంద్రం వద్ద ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సై రాజేష్‌లు, పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' ర్యాలీ

ముషీరాబాద్: దేశంలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలు చేస్తున్నాయని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జై బాపు... జై భీమ్.. జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ భారత రాజ్యాంగ పుస్తకాన్ని చేతపట్టి ర్యాలీలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ రాజకీయ దురుద్దేశంతో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుచుతూ మాట్లాడినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. భారత రాజ్యాంగాన్ని, విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల్లోకి భారత రాజ్యాంగాన్ని, అంబేద్కర్ స్ఫూర్తి, బాపూజీ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నామని అన్నారు.

- కులగణన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టాకే కేంద్రంలో కదలిక వచ్చిందని అందువల్లే ప్రధాని మోదీ కులగణన నిర్ణయం తీసుకున్నారని అన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు

కులగణన కార్యక్రమాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి డి.వెంకటేష్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తమగొండ రాజ్‌దీప్, జనిగే శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణముదిరాజ్, లింగంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ...

ముషీరాబాద్‌లోని శివాలయం చౌరస్తా వద్ద గల రేషన్ షాపులో లబ్ధిదారులకు ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సన్నబియ్యం పంపిణీ చేశారు. రేషన్‌కార్డు లబ్ధిదారులతో సన్నబియ్యం ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, నాయకులు డాక్టర్ మినాజ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, రమేష్, జి.గోవింద్, సురేష్‌కుమార్, మారిశెట్టి నర్సింగ్‌రావు, జయకుమార్, అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.